క్లుప్తంగా

అపర భగీరథుడు కాటన్

కడప రూరల్ : గోదావరిపై ఆనకట్ట నిర్మించి సాగు, తాగునీటిని అందించిన అపరభగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్ బిషప్ శ్యామూల్ బాబు అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత కలెక్టరేట్ వద్దనున్న అనాథలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లాండ్‌లో ఆర్థర్ కాటన్ జన్మించారన్నారు. ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కాలంలో బ్రిటీషు ఆర్మీ ఆఫీసర్‌గా, ఇరిగేషన్ ఇంజనీరుగా పనిచేశారన్నారు. ఆ సమయంలో రాజమండ్రి, ప్రకాశం బ్యారేజ్‌లు నిర్మించి సాగు, తాగునీటిని అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రధానంగా గోదావరి నదిపై ఆనకట్టను నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందించి సస్యశ్యామలం చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో స్వజ్జన్ రత్నకుమార్, డేవిడ్ రాజ్, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పాసు పుస్తకాలు పోయినవి

కమలాపురం : పట్టణంలోని పోస్టాఫీస్ నుంచి ఆర్టీసి బస్టాండుకు వెళ్లే దారిలో చెన్న కృష్ణారెడ్డికి సంబంధించిన పోస్టల్ పాసు పుస్తకాలు పోయినట్లు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నకృష్ణారెడ్డి తన ద్విచక్ర వాహనంలో పోస్టాఫీసు నుంచి తన ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినాయని, ఎవరికైనా దొరికితే పోస్టాఫీసులో గాని, పోలీస్ స్టేషన్‌లో గాని లేదా బాధితుడు చెన్నకృష్ణారెడ్డికి గాని అందజేయాలని ఆయన తెలిపారు. బాధితుని సెల్ నెంబర్ 9642781281 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

చలివేంద్రంతో ఊరట

పులివెందుల టౌన్ : పట్టణం మెయిన్ రోడ్డులోని వినాయకుడి గుడి సమీపంలో ఉన్న విజయ పాలడైరీ దుకాణం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని వీరపునాయునిపల్లె మండలం అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బండి రామకృష్ణారెడ్డి ఏర్పాటు చేశారు. ప్రతీ ఏడాది రోజుకు 800 లీటర్లు చొప్పున మజ్జిగను అందించడం జరుగుతోంది. బండి కుటుంబీకులను అభినందిస్తున్నట్లు వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు.

ఏపీఆర్జేసీలో మెరిసిన విద్యార్థులు

పులివెందుల టౌన్ : స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్, ఏపీఆర్జేసీ ఉచిత కోచింగ్ నుంచి గత నెల 25వ తేదీన ప్రభుత్వం నిర్వహించిన ఏపీఆర్జేసీ ప్రవేశపరీక్షకు 9 మంది హాజరు కాగా మొదటి కౌన్సిలింగ్‌కు రాజుల పల్లవి బైపీసీలో 94 మార్కులతో 400 ర్యాంకు సాధించగా, మద్దాల మేఘన ఎంపీసీలో 95 మార్కులతో 1050 ర్యాంకు సాధించి కర్నూల్ జిల్లా బనవాసి రెసిడెన్సియల్ కళాశాలకు ఎంపికయ్యారు. అలాగే బత్తల శివనిఖిల్ ఎంపీసీలో 84 మార్కులతో 2454 ర్యాంకు సాధించి అన్నమయ్య జిల్లా గ్యారంపల్లి రెసిడెన్సియల్ కళాశాలకు ఎంపికైనట్లు సేవాసమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. విద్యార్థులకు సేవా సమితి అధ్యక్షుడు బహుమతులు ప్రధానం చేశారు.

కార్యక్రమంలో సే వాసమితి ఉపాధ్యక్షురాలు అనూష, కార్యదర్శి సునీత, ప్రధాన కార్యదర్శి హేమలత, లింగాల మండల కోఆర్డినేటర్ మస్తాన్‌బాషా, పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, నేత్రసేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

18న వాసవీమాత జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 18న శ్రీ వాసవీ మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మహాప్రాకారోత్సవం, అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. సాయంత్రం 7 గంటలకు 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో లక్షకుంకుమార్చన జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

క్షయ నివారణకు టీకాలు తప్పనిసరి



సిబ్బందికి సలహాలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

సంబేపల్లె : క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ అడల్ట్ బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని డీఎం అండ్ హెచ్‌ఓ కొండయ్య, లెప్రసీ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్‌లు తెలిపారు. బుధవారం సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు ఆకస్మిక తనిఖీ చేశారు. క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా టీకాలను ప్రజలకు అందించాలని తెలియజేశారు. క్షయ నిర్మూలనకు ప్రతి గురువారం వేసే టీకాల ఏర్పాట్లను వారు పరిశీలించారు. దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సునీల్ కుమార్ నాయక్ నేటి నుంచి ఈ వ్యాక్సిన్‌ను వేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారం వైఎస్సార్‌సీపీదే

• గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బి.హెచ్



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతో గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, ప్రవాసాంధ్రులు

కడప కార్పొరేషన్ : అధికారం చేపట్టేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అని ఆ పార్టీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి ప్రవాసాంధ్రులు మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ కడప అసెంబ్లీ అభ్యర్థి ఎస్‌బి అంజద్‌బాషా, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పి. రవీంద్రనాథ్ రెడ్డిలను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 135 అసెంబ్లీ స్థానాలతో జగనన్న రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని తెలిపారు. పులివెందుల్లో తాను గెలుస్తానని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బీటెక్ రవి చెప్పడం అతిపెద్ద జోక్ అన్నారు. కడపలో టీడీపీ అభ్యర్థి మాధవి మతాల మధ్య చిచ్చు రేపి గెలవాలని ప్రయత్నించారని, పరమత సహనానికి మారుపేరైన కడప ప్రజలు ఆమెకు బుద్ధి చెప్పబోతున్నారన్నారు. సౌమ్యుడు, అందరివాడు అయిన అంజద్‌బాషా హ్యాట్రిక్ కొట్టబోతున్నారన్నారు. గల్ఫ్ దేశాల నుంచి వచ్చి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం పని చేసిన ప్రవాసాంధ్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కువైట్, ఖతార్ వైఎస్ఆర్‌సీపీ కో కన్వీనర్లు షా హుస్సేన్, జాఫర్ హుస్సేన్, కువైట్ గవర్నింగ్ సభ్యులు షేక్ గఫార్, సుబ్బారెడ్డి, కువైట్ కమిటీ సలహాదారులు అబూ తురాబ్, కడప ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యులు షేక్ అన్సర్ బాషా, బాబు భై, షేక్ గయాజ్, సౌదీ అరేబియా ఎన్ఆర్ఐ షేక్ అబ్రారర్, కువైట్ ఎన్ఆర్ఐ లు మల్లికార్జున రెడ్డి, సాదిఖ్ లీడర్, షేక్ రాజక్, షరీఫ్, ఇనాయతుల్లా, సద్దాం, దుబాయ్ ఇమ్రాన్, బి.హెచ్. ఎజాస్, అబ్దుల్ రౌఫ్, అఫ్సర్, ఫారూఖ్ పాల్గొన్నారు.

సాహిత్యం, చరిత్రలతో జిల్లా ప్రతిష్టను పెంచిన ‘కట్టా’



విద్వాన్ కట్టా నరసింహులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : విద్వాన్ కట్టా నరసింహులు కైఫీయత్తుల పరిష్కారం ద్వారా మరుగున పడిన గొప్ప చరిత్రను వెలికితీసి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేశారని వైవీయూ పాలక మండలి సభ్యులు, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బ్రౌన్ గ్రంథాలయ తొలి బాధ్యులు, కడప కైఫీయత్తుల పరిష్కర్త విద్వాన్ కట్టా నరసింహులు 3వ వర్ధంతిని పురస్కరించుకొని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు ఆధ్వర్యంలో బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించింది. తొలుత కట్టా చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా రచయితల సంఘంతో కలసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్య మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కట్టా సేవలను కొనియాడారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయ ఆవరణలో బ్రౌన్ శాస్త్రి సరసన కట్టా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జానమద్ది నాగరాజు, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారిలు మాట్లాడుతూ కట్టా లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో చిత్రకారుడు వెంకటేష్, మధు, డేవిడ్, గొబ్బూరి కోటేశ్వరరావు, జ్యోతి జార్జి తదితరులు పాల్గొన్నారు.

కడప వారసత్వం విలువ తెలిపిన ‘కట్టా’

కడప కైఫీయత్తుల పరిష్కారంతో కడప వారసత్వ సంపద విలువ ఎంత గొప్పదో కట్టా తెలిపారని ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. కట్టా తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన కైఫీయత్తుల ఆధారంగా రచించిన కథల పుస్తకాన్ని కడప కైఫీయత్తులను జిల్లా వారసత్వ సంపదగా భావించి ఇంటాక్ గ్రంథాలయంలో వాటిని అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

డెంగీ నివారణలో భాగస్వామ్యులు కావాలి



అవగాహనా పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

పోస్టర్ల విడుదలలో డీఎంఅండ్‌హెచ్‌ఓ

రాయచోటి అర్బన్ : డెంగీ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం డీఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వైద్య ఆరోగ్యశాఖ జేడీ దేవసాగర్, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ లతో కలసి డెంగీ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధి నివారిద్దాం అనే నినాదంతో ముందుకు వెళుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డెంగీ వ్యాధి ఈడిస్ దోమ, టైగర్ ఆడ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ డెంగీ వ్యాధి, నివారణల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డెంగీ నిర్ధారణ అయిన గ్రామాల్లో వెంటనే పైరేత్రియం, స్ప్రేయింగ్, ఫాగింగ్‌లు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ శైలజ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి ఉషశ్రీ, మలేరియా సబ్ యూనిట్ అధికారులు ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, సీహెచ్‌ఓలు నారాయణ, రామక్రిష్ణలు, అధికారులు బలరామరాజు, సరళ, శివారెడ్డి, పెంచలయ్య, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని గుట్టపై వెలసిన శ్రీ కాల భైరవ స్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పట్టువస్త్రాలు, రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకొనేందుకు స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు కూడా విశేషంగా తరలివచ్చారు. ఈనెల 23వ తేదీ కాలభైరవ స్వామి తిరునాల నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ధర్మారెడ్డి, ఆలయ నిర్వాహకులు తెలిపారు. రాత్రి చాందినీ బండ్లతో మెరవణి ఉంటుందని భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు.

కడపలో ఈవీఎం స్ట్రాంగ్ రూములను పరిశీలించిన ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

కడప అర్బన్ : నగరంలో భద్రపరిచిన ఈవీఎం స్ట్రాంగ్ రూములను జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత కడప పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్‌కు నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికలు ఈ నెల 13న ముగిశాయి. ఎన్నికల తర్వాత కౌంటింగ్ కోసం ఈవీఎంలను కడప శివారులోని మౌలానా అబ్దుల్ కలాం ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో భద్రపరిచారు. జూన్ నాలుగో తేదీన కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఎస్పీ సిద్ధార్థ కౌశల్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్వీ కృష్ణరావు, సిబ్బందితో కలిసి స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించి భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసేవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడినా.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

ఆర్బీకేల్లో సబ్సిడీ విత్తనాలు

ఒంటిమిట్ట : మండలానికి పచ్చిరొట్టె విత్తనాలు, జీలుగలు 100 క్వింటాళ్లు, జనుములు 24 క్వింటాళ్లు వచ్చాయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. విత్తనాలు అవసరమున్న రైతులు రైతు భరోసా కేంద్రాలలో ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు చెల్లిస్తే 23వ తేదీ నుంచి విత్తనాలను పంపిణీ చేస్తామని చెప్పారు. జీలుగలు అసలు ధర కేజీ రూ. 88లు ఉండగా 50 శాతం సబ్సిడీ పోను రూ. 44లు, జనుములు అసలు ధర కేజీ రూ. 88లు ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ. 44లు చెల్లించి పొందవచ్చన్నారు. ఆసక్తి కల్గిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవం

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని కొండమూల గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఉత్సవాలు వైభవంగా ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. అమ్మవారిని అలంకరించి సింహ వాహన ప్రభతో వాయిద్యములతో, గంధ సింధూర పుష్పాదులతో శోభాయమానంగా అలంకరించి అమ్మవారిని ఊరేగించారు. ఊరేగింపు సందర్భంగా గ్రామంలో బాణసంచా పేలుళ్లు, బళ్లారి డ్రమ్స్, కేరళ వాయిద్యములతో శ్రీ తొగటవీర క్షత్రియులచే మేలుకొలుపు పద్యములతో కనుల పండువగా పుష్పపల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. బుధవారం ఉదయం 5 గంటలకు అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున తొగట వీరక్షత్రియ సంఘం కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి



ఊరేగింపులో కళా ప్రదర్శనను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : లింగాల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ శాంతయ్య ఒక ప్రటకనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులై 40 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు కూడా అర్హులన్నారు. అభ్యర్థులు iti.ap.gov.in ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవడానికి జూన్ 10వ తేదీన చివరి గడవు అని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు రెండు సంవత్సరాల కోర్సుకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎలక్ట్రిషన్, ఫిట్టర్, సివిల్, మెకానికల్, డిజిల్, కంప్యూటర్ అపరేటింగ్, కోర్సులు ఉన్నాయన్నారు. ఐటీఐ కళాశాలలోని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. పది మార్కుల జాబిత, టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఫొటో, విద్యార్థిని, విద్యార్థులు ఫోన్ నంబరు ఈమెయిల్ ఐడీలను దరఖాస్తులలో పొందపరచాలన్నారు. వివరాలకు 97041 11807, 9912963 71 నంబర్లకు సంప్రదించవలెనన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న జరుగనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరావు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ (మండలాధ్యక్షురాలు) జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన అన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని ఎంపీడీఓ కోరారు. చట్టరీత్యా మండల సమావేశం నిర్వహించవలసి ఉన్నందున ఎలాంటి తీర్మానాలు ఆమోదం పొందవని ఎంపీడీఓ తెలియజేశారు.

50 క్వింటాళ్ల జీలుగలు మంజూరు

కమలాపురం : మండలానికి 50 క్వింటాళ్ల జీలుగలు మంజూరైనట్లు ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలానికి 50 క్వింటాళ్ల జీలగలు, 4 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు మంజూరు అయ్యాయన్నారు. కావలసిన రైతులు తమ పరిధిలోని ఆర్‌బీకేలకు వెళ్లి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి బయోమెట్రిక్ ద్వారా విత్తనాలు పొందవచ్చన్నారు. జీలుగలు క్వింటా పూర్తి ధర రూ.8800 కాగా 50 శాతం సబ్సిడీతో రూ.4400 చెల్లించి పొందవచ్చన్నారు. ఏకరాకు 10 కిలోల బ్యాగు చొప్పున గరిష్టంగా 5 ఏకరాలకు 50 కిలోలు పొందవచ్చన్నారు. అలాగే పిల్లి పెసర క్వింటా పూర్తి ధర రూ.13,400 కాగా 50 శాతం సబ్సిడీ రూ.6700 చెల్లించి విత్తనాలు పొందవచ్చని ఆమె తెలిపారు. ఏకరాకు 8 కిలోల బ్యాగు చొప్పున గరిష్టంగా 5 ఏకరాలకు 40 కిలోలు ఇవ్వడం జరుగు తుందన్నారు. జీలగలు సాగు చేసుకోవడం వలన నేల యొక్క సేంద్రీయ కార్బనము పెరుగుతుందన్నారు. అలాగే నేలకు నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలు అందజేయవచ్చన్నారు. నేల గుల్ల బారి మురుగునీరు పోవడానికి దోహద పడుతుందన్నారు. జీలగల వలన చౌడు భూముల్లో చౌడు విరిగిపోతుందన్నారు.

21న మర్రిచెట్టు లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం

లక్కిరెడ్డిపల్లె : ఈ నెల 21న కుర్నూతల క్రాస్ రోడ్డు మర్రిచెట్టు వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించ తలపెట్టినట్లు ఆలయ అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి, ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. బుధవారం లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవ కార్యక్రమ లగ్నపత్రికను అర్చకులు సమక్షంలో నిర్వాహకులు రాయించారు. లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవంను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కల్యాణోత్సవ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండల ప్రజలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు. కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణతోపాటు స్వామివారి గ్రామోత్సవం ఉంటుందన్నారు.

వెల్లాల ఆలయాలకు రూ.13 లక్షల ఆదాయం

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాలకు సంబంధించి తలనీలాల వేలంపాట ద్వారా రూ.13.08 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థానాల చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వర రెడ్డి, ఆలయ ఈఓ బీవీ నరసయ్య తెలిపారు. వెల్లాలలోని సంజీవరాయ కల్యాణ మండపంలో బుధవారం తలనీలాల వేలంపాటను చైర్మన్, ఈఓ, పర్యవేక్షణాధికారి ఆర్‌ఆర్ నరసింహ సింగ్ అధ్యక్షతన వేలంపాటను నిర్వహించారు. ఈ వేలం రెండు సార్లు వాయిదా పడిన తర్వాత మూడోసారి ప్రొద్దుటూరులోని రామేశ్వరానికి చెందిన మునిశేఖర్ అత్యధికంగా పాటపాడి దక్కించుకున్నాడు. పాటదారుడు ఏడాది పాటు ఈ ఆలయంలో తలనీలాలను పోగు చేసుకోవచ్చునని వారు చెప్పారు.

పెద్దమ్మ తల్లీ.. కరుణించవమ్మా..

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో పెద్దమ్మ, చిన్నమ్మ అమ్మవారి జాతర ఈనెల 18,19వ తేదీలలో వైభవంగా నిర్వహించనున్నారు. అందుకు గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం 1000 మంది మహిళలు చల్ల ముద్దలను అమ్మవార్లకు సమర్పించారు. సల్లముద్దలను బోనంతో ఊరేగింపుగా వచ్చి పెద్దమ్మ, చిన్నమ్మ అమ్మవార్లకు సమర్పించారు. గ్రామంలోని వీధివీధిన విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈనెల 18వ తేదీన పెద్దమ్మ, చిన్నమ్మ అమ్మవార్ల కథ, ఊరేగింపు ఉంటుంది. 19వ తేదీన పెద్దమ్మ తల్లి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.



పెద్దమ్మతల్లికి చల్ల ముద్దలను ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు

కల్యాణ వైభోగమే..



గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజైన బుధవారం అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి వేకువజామున విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, శాంతిహోమాలు, జపపారాయణలు వేదపండితుల ఆధ్వర్యంలో జరిగాయి. గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కాలక్షేప మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ముత్యాల తలంబ్రాలతో కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా జరిపారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ శంకర్ బాలాజీ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– ప్రొద్దుటూరు కల్చరల్

వైభవంగా గ్రామోత్సవం



మైదుకూరులో బ్రహ్మంగారి గ్రామోత్సవం

మైదుకూరు పట్టణంలో కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా వీరబ్రహ్మం గోవిందమాంబల ఉత్సవ మూర్తులను అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బ్రహ్మంగారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామోత్సవంలో నిర్వహించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

– మైదుకూరు